క్లుప్తంగా

గోశాల ప్రారంభం



గోశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: గోవులను పూజించడం హిందూ సంప్రదాయమని, దీనిని మన పూర్వీకులు ఆచరించారని, గోమాత విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. గుండవల్లిపేటలో సురభి పేరున పంచిరెడ్డి విశ్వనాథం (బుజ్జి) నిర్మించిన గోశాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గోమాత విశిష్టతను వివరించారు. స్వతహాగా తనకు ఆవులను పెంచే అలవాటు ఉందన్నారు. అనంతరం ఉమా స్వయంబేశ్వర స్వామి ఆలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ ఆరంగి మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మాన రామదాసు, ధర్మాన జగన్, పంచిరెడ్డి సత్యం, సురంగి నర్సింగరావు, బగ్గు రమణయ్య, అల్లు అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హిరమండలం: స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయానికి చెందిన నలుగురు విద్యార్థినులు ఈ నెల 5వ తేదీన విశాఖపట్నం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన యునైటెడ్ షాట్ ఖాన్ కరాటే టూ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో 7వ అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటారు. విద్యాలయంలో కరాటే విజేతలను ప్రత్యేకాధికారి ఎస్.కృష్ణవేణి, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. ఈ పోటీల్లో నేపాల్, బోపాల్, శ్రీలంక, సౌదీఅరేబియా, బంగ్లాదేశ్, భారత్ తదితర దేశాలకు చెందినవారు పాల్గొన్నట్లు కరాటే శిక్షకుడు సింహాచలం తెలిపారు. అండర్–12 విభాగంలో టి.గుణశ్రీ గోల్డ్ పతకం, గీతశ్రీ సిల్వర్ పతకం సాధించారన్నారు. అండర్–14 విభాగంలో జి.చాందిని బ్రాంజ్ మెడల్, అండర్–15 విభాగంలో టి.ఝాన్సీలక్ష్మి గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



భోజనాలు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

ఆమదాలవలస రూరల్: అక్కులపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలువురి గర్భిణులకు వైద్యాధికారి కూన మీనాకుమారి శనివారం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అక్కులపేట సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని వైద్యాధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వట్టం కామరాజు, భేరి బసవరాజు కుటుంబ సభ్యులు పౌష్టికాహారాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రతి నెలా 9వ తేదీన పీహెచ్‌సీకి వచ్చే గర్భిణులు, వారి కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బందికి అన్నదానం చేయడం సమితి సేవలకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమం గత ఏడేళ్లుగా నిరంతరాయంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. సమితి జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు, సభ్యులు సాయికృష్ణ, పవన్, అరుణ, శ్రీదేవి, సరోజిని, రవణమ్మ, అనూష, తనూజ, వైష్ణవి, శ్రీను, రామచంద్రరావు, షణ్ముఖ, సురేష్, తేజ, శివ, నిరంజన్, కె.వెంకటరావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ..



శ్రీముఖలింగంలో వెంకటరమణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: శ్రీముఖలింగం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బసవ సంజీవరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యులు వెంకటరమణ, యోగీశ్వరరావు, గౌతమిని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శనివారం పరామర్శించారు. పాగోడులో నేతింటి కురమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతిని భార్య చిన్నమ్మిని ఎమ్మెల్యే పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ వాన గోపి, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దామ మన్మథరావు, ధర్మాన జగన్, మెండ కృష్ణ, రావాడ చందన బాబు, చింతాడ వెంకటరమణ, పాపారావు, మంత్రి అప్పన్న, పంగ రామకృష్ణ, వెలమల ఎర్రన్న, నక్క రామారావు తదితరులు ఉన్నారు.

గిరిపై వెలుగులు

- కొండ మీద గ్రామానికి ఏళ్ల తరువాత విద్యుత్ సరఫరా
- రూ.10 లక్షలతో గిరిజన గ్రామానికి కరెంట్ సదుపాయం



విద్యుత్ కనెక్షన్లతో ఉన్న సవరబొంతు గూడ



సవరబొంతుగూడలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



సారవకోట: వారికి కొండే జీవనాధారం. గిరులపై పండే పంటలే ఆధారం. చాలా ఏళ్లు వీరు నూనె, కిరోసిన్ దీపాల వెలుగులోనే జీవనం సాగించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ గ్రామానికి వెలుగులు నిండాయి. మండలంలోని చిన్నకిట్టాలపాడు పంచాయతీ సవరబొంతు గూడ గ్రామానికి 20 ఏళ్ల క్రితం సీతంపేట, కొత్తూరు తదితర మండలాల నుంచి కొంత మంది గిరిజనులు వలస వచ్చి స్థిరపడ్డారు. ఆయా మండలాల నుంచి 10 కుటుంబాలకు చెందిన 46 మంది ఇక్కడకు వచ్చి సమీపంలో ఉండే కొండల్లో పోడు వ్యవసాయం చేస్తూ (చీపురు, వేరు పనస, పసుపు, కంద తదితర పంటలు) జీవనం సాగిస్తున్నారు. అప్పటివరకు ఇక్కడకు ఏ ఒక్కరూ వెళ్లేందుకు అవకాశం లేనటువంటి పరిస్థితి. వీళ్లు అక్కడకు చేరుకుని నివాసాలు ఏర్పాటు చేసుకుని నూనె, కిరోసిన్ దీపాల వెలుగులోనే రాత్రంతా గడిపేవారు. అనంతరం సోలార్ దీపాలను సొంతంగా ఏర్పాటు చేసుకున్నారు. వైఎస్సార్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వీరి సమస్యలను స్థానిక నాయకులు నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రూ.10 లక్షలతో ఆ గ్రామానికి విద్యుత్ సదుపాయం కల్పించారు. ఆయనే భూ ఉపరితలం నుంచి సుమారు 2 కిలో మీటర్లు ఎత్తున ఉన్న ఆ గ్రామానికి వెళ్లి విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ప్రస్తుతం ఆ గిరిజన గ్రామంలో విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. ఇంతవరకు తమ గ్రామానికి వచ్చిన నాయకుడే లేడని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత తమ గ్రామాన్ని సందర్శించి విద్యుత్ సరఫరాను ఎమ్మెల్యే కృష్ణదాస్ ఏర్పాటు చేశారని గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూశాం



విద్యుత్ సరఫరా కోసం ఈ గ్రామానికి వలస వచ్చిన నాటి నుంచి ఎదురు చూశాం. ఇప్పటి ప్రభుత్వంలో నరసన్నపేట ఎమ్మెల్యే దృష్టికి తమ సమస్యను స్థానిక నాయకుల ద్వారా తీసుకువచ్చాం. తమ గ్రామానికి విద్యుత్ సరఫరాను అందించారు. విద్యుత్ సరఫరా లేనంత వరకు చీకటిలో ఉండే వాళ్లం. ప్రస్తుతం ఆ సమస్య తీరింది.

– సవర కుమార్, సవరబొంతు గూడ, సారవకోట మండలం

మహిళల ఆర్థికాభివృద్ధికి ఆసరా



మాట్లాడుతున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ



మహిళా సంఘాలకు ఆసరా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని కోవిలాం కాలనీ వద్ద ఏబీ రోడ్డు పక్కన శనివారం ఆసరా నమూనా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని డ్వాక్రా మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులకు సీఎం జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చారన్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను ఆసరా పథకం ద్వారా జగనన్న తీర్చుతున్నారని గుర్తుచేశారు. పరిపాలనపరంగా మహిళలకు సముచిత స్థానం కల్పించారన్నారు. మహిళలకు ప్రయోజనం కలిగేలా అమ్మఒడి, ఆసరా, జగనన్న కాలనీ ఇళ్ల పట్టాలు, కాలనీ ఇళ్లు ఇలా అనేక సంక్షేమ పథకాలు ఇచ్చారన్నారు. 2014 ఎన్నికల ముందు చంద్రబాబు 600 హామీలు ఇచ్చారని, ఇందులో ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. జాబు కావాలంటే బాబు రావాలని బాకా ఊదిన బాబు ఎంతమందికి జాబులు ఇచ్చారని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి ఎంతమందికి, ఎన్ని నెలలు ఇచ్చారో చెప్పాలన్నారు. రైతులు పంట రుణాల కోసం బ్యాంకుల్లో పద్దు పెట్టిన బంగారం విడిపించి ఇంటికి తెచ్చిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిన చంద్రబాబును ప్రతి ఒక్కరూ నిలదీయాలని పిలుపునిచ్చారు. మరో రెండు, మూడు నెలల్లో ఎన్నికలు వస్తున్నందున ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు మాయమాటలు చెబుతున్నారని, వాటిని ఎవరూ నమ్మవద్దన్నారు. ప్యాకేజీలు తీసుకుని మద్దతు ఇచ్చే పవన్ కల్యాణ్‌తో రాష్ట్రానికి జరిగే మేలేమీ లేదన్నారు. మహిళా సంఘాల సభ్యులతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, వైస్ ఎంపీపీ శివ్వాల ఇందమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, వైకేపీ ఏపీఎం రవిరాజ్, పార్టీ నాయకులు లోచర్ల మల్లేశ్వరరావు, శిమ్మ సాంబశివరావు, కొల్ల రాము, ముగడ జనార్దన, తలసముద్రం శోభన్‌బాబు, కొల్ల లక్ష్మునాయుడు, ముద్దాడ లక్ష్మణరావు, రావాడ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రూ.25 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం



బస్టాండ్‌లో నిర్మిస్తున్న మరుగుదొడ్లు

పాతపట్నం: స్థానిక పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న బస్టాండ్‌లో సుమారు రూ.25 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణ పనులు శరవేగంగా చేపడుతున్నట్లు సర్పంచ్ శిర్ల వేణుకుమారి శనివారం తెలిపారు. అనకాపల్లికు చెందిన శ్రీలక్ష్మి నర్సింహా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.25 లక్షతో మహిళలకు, పురుషులకు మరుగుదొడ్లు, స్నానపు గదులను నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు, ప్రజలకు 24 గంటలపాటు అందుబాటులో ఉంటాయని, స్నానాలకు వెడినీరు సదుపాయం కూడా ఉంటుందన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పోలాకి: మబగాం సబ్‌స్టేషన్‌లో సోమవారం కొత్త అడిషనల్ పీటీఆర్ పనులు జరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టెక్కలి విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శంకర్ శనివారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మబగాం, పూడివానిపేట, వనితమండలం, ఖాన్‌సాహెబ్‌పేట, మబగాం కాలనీ, గజపతినగరం, కత్తిరివానిపేట, జనావానిపేట, జొన్నాం, దుబ్బకవానిపేట, మల్లపేట, కొల్లివలస, తలసముద్రం, ధీర్ఘాశి, ఈదులవలస, ముప్పిడి, రాళ్ళపాడు, తోటాడ, గొల్లలవలస, ఎస్.ఎల్.పురం, కొండలక్కివలస, కింజరాపువానిపేట పరిధిలో వ్యవసాయ కనెక్షన్లు, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

60 రోజుల్లోగా ఎరువులు వేసుకోవాలి

జలుమూరు: రబీ వరి పంటకు 60 రోజుల లోపల అన్ని రకాల ఎరువులు వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.సురేష్ కుమార్ శనివారం తెలిపారు. నాట్లు వేసిన నాలుగు, ఐదు రోజుల్లో పీకపురుగు రాకుండా గుళికలు తప్పనిసరిగా వేయాలన్నారు. సాధారణంగా ఖరీఫ్ వరికి ఎరువులు వేసిన విధంగా రైతులు ఈ పంటకు కూడా వేస్తుంటారని, అలా వేయకూడదన్నారు. తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.



ఏఓ సురేష్‌కుమార్

దేశభక్తి కలిగి ఉండాలి



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

కొత్తూరు: విద్యార్థుల్లో దేశభక్తి మెండుగా ఉండాలని భారతీయ విద్యా కేంద్రం డైరెక్టర్ రమణమూర్తి అన్నారు. స్థానిక విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాల 34వ వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ కలమట శ్రీరాముల అధ్యక్షతన శనివారం నిర్వహించారు. పాఠశాల చైర్మన్ లోతుగెడ్డ లక్ష్మీనారాయణ, రిటైర్డ్ హెచ్ఎం వై.గోపాలదాసు నాయుడు మాట్లాడుతూ విద్యతోపాటు నైతిక విలువలు, ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. ఎంఈఓలు గోవిందరావు, శ్రీనివాసరావు, పాఠశాల కరస్పాండెంట్ కాశీబాబు, బరాటం గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగువాడ రైల్వే గేటు మూసివేత

పాతపట్నం: మండలంలోని గంగువాడ గ్రామానికి అనుకుని ఉన్న రైల్వే గేటును ఆదివారం ఉదయం 10 నుంచి 4 గంటల వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గేటు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో పాతపట్నం–టెక్కలి మధ్య వాహన రాకపోకలకు అంతరాయం ఉంటుందన్నారు. టెక్కలి నుంచి వచ్చే వాహనాలకు తెంబూరు మీదుగా సారవకోటకు మళ్లించామన్నారు. వాహనదారులు, ప్రజలు గమనించాలన్నారు.

ప్రతిభ కనబరిస్తే నగదు ప్రోత్సాహం

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరస్తే.. ఇదే పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకుని ఇస్రో శాస్త్రవేత్తగా ఎదిగిన యెన్ని గోవిందరావు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తానని ప్రకటించినట్లు హెచ్ఎం ఎ.గోవిందరావు శనివారం తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు ప్రతీ ఏడాది నగదు ప్రోత్సాహకంగా అందజేయనున్నట్లు హెచ్ఎం చెప్పారు. చదువుకున్న పాఠశాల విద్యార్థులకు ఇటువంటి ప్రోత్సాహకాలు ప్రకటించడం వల్ల పోటీతత్వం పెరుగుతుందన్నారు.

మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షునికి సత్కారం



పూర్ణచంద్రరావును సత్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు

ఆమదాలవలస: మాజీ సైనికుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన కటకం పూర్ణచంద్రరావుకు (ఆమదాలవలస) శ్రీమద్విరాట్ విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ ఎంప్లాయిస్ యూనియన్ తరఫున స్థానిక లక్ష్మీనగర్ స్కూల్ ఆవరణలో శనివారం సత్కరించారు. సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు మాస్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు పలువురు మాట్లాడారు. పూర్ణచంద్రరావు తన స్వశక్తితో పైకి వచ్చాడని, ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు. సంఘం సెక్రెటరీ దుప్పలపూడి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు మండా రాజేశ్వరరావు, లోలుగు దిలీప్, ఒమ్మి భాస్కరరావు, అద్దంకి రామరాజు, టేకి గోపాలకృష్ణ, దుప్పలపూడి మన్మధరావు, మానేపల్లి ప్రసాదరావు, తోలేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి



దేశ భక్తి గీతాలకు నృత్యం చేస్తున్న విద్యార్థులు

సారవకోట: ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవాలని, భవిష్యత్‌లో స్థిరపడేందుకు 10వ తరగతి తొలి మెట్టు అని నవతేజ పాఠశాల ప్రిన్సిపాల్ అప్పలనాయుడు అన్నారు. పదో తరగతి విద్యార్థులకు శనివారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు దేశ భక్తిగీతాలకు నృత్యం చేశారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: అభివృద్ధి, సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ ఆరంగి మురళి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. వివిధ శాఖల పనితీరుపై చర్చించారు. గ్రామ పంచాయతీలకు 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్లు వచ్చాయని, వీటిలో రూ.50 లక్షల మాత్రమే ఖర్చు జరిగిందని, మిగిలిన నిధులు ప్రభుత్వం సూచించిన మేరకు ఖర్చు చేయాలని సర్పంచ్‌లకు ఎంపీడీఓ రామకృష్ణారావు సూచించారు. ఈ నిధులు ఖర్చు చేస్తేనే మరో రూ.2 కోట్లు వస్తాయన్నారు. మండల పరిషత్ నుంచి రూ.కోటితో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నామని సభ దృష్టికి ఎంపీపీ తీసుకువచ్చారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమన్వయంతో ఈ నిధులు ఖర్చు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, ప్రత్యేక ఆహ్వానితుడు యాళ్ల కృష్ణంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, పాగోటి రాజారావు, చింతల వెంకటరావు, సర్పంచ్‌లు పోలాకి నర్సింహమూర్తి, యాబాజి రమేష్ పాల్గొన్నారు.

నేటినుంచి ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్



హిరమండలం: ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించే గదులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

బూర్జ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నుంచి ఇంటర్మీడియెట్ సైన్స్ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పైల శశిధర్ శనివారం తెలియజేశారు. ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 46 మంది, మండలంలోని కొల్లివలస కేజీబీవీ నుంచి 29 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలియజేశారు. నాలుగు బ్యాచ్‌లుగా విభజించి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సైన్స్ లెక్చరర్లు ఎగ్జామినర్లుగా పాల్గొంటారన్నారు. చీఫ్ సూపరింటెండెంటుగా కళాశాల ప్రిన్సిపాల్ వ్యవహరిస్తారన్నారు. ఈ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు హిరమండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీఈఎస్ పట్నాయక్ తెలిపారు. కళాశాలలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్న గదులను శనివారం పరిశీలించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ హిరమండలం, ఎల్.ఎన్.పేట జూనియర్ కళాశాలల విద్యార్థులతోపాటు స్థానిక కేజీబీవీ విద్యార్థినులు మొత్తం 95 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతారన్నారు. ఈ నెల 11 నుంచి 15 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండుపూటలా పరీక్షలు ఉంటాయన్నారు. స్థానిక కళాశాలకు చెందిన ఎంపీసీ విద్యార్థులు 13 మంది, బైపీసీ నుంచి 23 మంది, ఒకేషనల్ ఎంఏటీ నుంచి 19 మంది, ఈఈటీ 22 మంది, ఈటీ 18 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతారన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ మేనక

హిరమండలం: అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతోనే మండలాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ తూలుగు మేనక తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు వివరించాలన్నారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో 2024–25లో రూ.22 కోట్లతో ఉపాధి హామీ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మండలంలోని దిగువరుగడ నుంచి ఎగువరుగడ వరకు, గొలుసు మామిడి గూడ నుంచి బలద గూడ వరకు, మోదుగువలస నుంచి మర్రిగూడకు, కల్లట నుంచి జిల్లోడిపేట మహేంద్రతనయ నది వరకు, ఏబీ రోడ్డు నుంచి గులుమూరు వరకు, కమనాపల్లి కాలనీ నుంచి పాత కొమనాపల్లి వరకు రహదారుల నిర్మాణానికి మండల పరిషత్ ప్రతిపాదించారు. ఈ రహదారుల మంజూరుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు తీర్మానించారు. సమావేశానికి పంచాయతీరాజ్, మత్స్య, ఇరిగేషన్, అటవీ, ఎక్సైజ్, చేనేత, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు గైర్హాజరు కావడంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఎంపీడీఓ స్వరూపరాణి తెలిపారు. ఎంపీపీ తూలుగు మేనక, ఏఎంసీ చైర్‌పర్సన్ సారిపల్లి నిరూష, వైస్ ఎంపీపీలు సవర వైకుంఠరావు, వంగపల్లి సావిత్రి, తహసీల్దార్ బి.సుధాకర్, సూపరింటెండెంట్ రమేష్, ఈఓపీఆర్డీ నాగమణి, జెడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, మండల కో ఆప్షన్ సభ్యుడు విష్ణు ప్రసాద్ పండా తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

ఆమదాలవలస: పట్టణ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ కె.వేణుగోపాల్ శనివారం పరిశీలించారు. లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్లోని 37, 38 పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. హెచ్ఎం బి.రామకృష్ణతో మాట్లాడి పాఠశాలలోని మౌలిక వసతులపై ఆరా తీశారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ పోలయ్య

మెళియాపుట్టి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ పోలయ్య అన్నారు. మండలంలోని పద్ద గ్రామంలో ఉపాధి వేతనదారులకు శనివారం సాయంత్రం అవగాహన కల్పించారు. గ్రామంలో ఒడిశా సంప్రదాయాలు కలిగిన కుటుంబాలు నివాసం ఉండటంతో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. బాల్య వివాహాలపై టోల్ ఫ్రీ 1098కి వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. క్షేత్రసహాయకుడు రాజు మజ్జి తదితరులు పాల్గొన్నారు.